# భార్య కాని భార్య

చివరికి హేమలత చనిపోయింది!

అవసానదశలో అదేపనిగా నాకోసం పలవరించిందనీ, నేను వొస్తే ఆవిడలో ఏదన్నా మానసిక పరిణామంకలిగి, ఆమె జీవించ వొచ్చుననీ తలిచి, దేశాలు పట్టుకుని అర్థంలేకుండా అశాంతితో తిరుగుతున్న నన్ను నా ఎడ్రసు తెలుసుకొని పట్టుకొచ్చారు.

నే నొచ్చేటప్పటికి హేమలత శల్యమై మంచాన్ని అంటుకుని వుంది. గుండె జల్లుమంది. ఆ జీర్ణమైన అస్థిపంజరపు స్వరూపాన్ని సమీపించడానికి భయమేసింది. కాని పూర్వపు ప్రేమభావం నన్ను ఆవిడని సమీపించేలా చేసింది.

ఇంట్లో ముసలితండ్రీ, తల్లీవున్నారు. భర్తతరఫువాళ్లెవరూ రాలేదు. అయిదేళ్ళు సాంసారిక జీవితాన్నిగడిపి, తన సాహచర్యంలో మసిలినస్త్రీ మృత్యుశయ్యమీదవుంటే చూడడానికికూడా రాలేని ప్రేమమూర్తి ఆవిడభర్త!

నేను వచ్చాక హేమలత బతికివున్నకాలం కొన్ని గంటలుమాత్రమే, నా రూపును గుర్తుపట్టలేనంత స్మృతిని కోల్పోయింది. అందుకని వాళ్ళు ఆశించినట్టు మానసిక పరిణామాలుకలిగేస్థితి దాటిపోయింది.

హేమా, హేమా...అని నుదుటిమీద చెయ్యివేశాను. ఏదో కుంపటితాకినంత వేడి తగిలింది.

టెంపరేచరు చూడడం, మంచుతో తల కాపడం; స్పూన్‌తో మందు పొయ్యడం; మొదలైనవి నా పని.

అలా 76 గంటలు అదేపనిగా నిద్రాహారాలు మాని, పూర్వజన్మఋణం తీర్చుకుంటున్నట్టు చాకిరి చేశాను.

కాని హేమలత దక్కలేదు. చని పోయింది!—లేదు, ఆత్మహత్య చేసుకుందనే నా అభిప్రాయం!

కాని తక్కినవాళ్లంతా ఏదో అకాలమృత్యువుకింద జమకట్టుకున్నారు.

హేమలత విడిచిన చివరవిశ్వాసం విన్న తక్షణమె ఒక ఉత్తమ నవల అర్థాంతంగా అంతమైనట్టు చక్కని ఫిల్మ మధ్యలో తెగి పోయినట్టు, ఒక్కసారిగా ఆలోచనలు నిలిచి పోయినట్టు, అయింది.

వెంటనే ఇల్లువిడచి నిర్జన ప్రదేశాన్ని వెతుక్కుంటూ వూరిబయటికి బయలుదేరాను.

దారిలో ఒక మిత్రుడు కనబడి "హేమలత చని పోయిందిట!" అన్నాడు.

"చనిపోలేదు, ఆత్మహత్య చేసుకుంది" అన్నాను.

"నీ తలకాయ?" అని వింతగా నవ్వాడు. నామనస్సు చివుక్కుమంది. కాని వాడికెట్లా చెప్పగలను. "అది మామూలు చావుకాదు; ఆత్మహత్య" అని. నిజం ఆవిడ జీవితంలో దొర్లుబాలైన రోజులకీ, చనిపోయిన ఆమెకీ, నాకు తెల్సు నేను అబద్ధం ఆడ్డంలేదు.

ఓ కోణంలోంచి జీవితాన్ని చూస్తే మనకి అదోమాది రగా కనుపిస్తుంది. చాలామంది పరిస్థితుల్ని కల్పించుకోవాలని ప్రయత్నిస్తారు— మేధావంతులు అంతకంటె ఎక్కువమంది పరిస్థితుల ప్రభావానికి బానిసలై దుఃఖపూరిత జీవితానికి లోబడతారు. అది చేతకానితనంకాదు. తెలివితక్కువ తనమూ కాదు. కారణం చెప్పగలగడం కష్టం.

పాతజ్ఞాపకాలూ, విచారభావంతో కూడిన కొత్త ఆలోచనలూ తలని బద్దలుచేస్తుంటే, సిగిరెట్టు మరో పక్క నించి మత్తు వొదిలిస్తోంది.

శ్మశాన వైరాగ్యం కాదుకద!

ఊరిబయట పచ్చని పచ్చిక బయల్లో కూచున్నాను.

మనం ఎంత విశాలమైన ప్రపంచంలో తిరుగుతున్న ప్పటికీ, మన హృదయ సామీప్యాన్ని పొందిన వ్యక్తులు చాలా తక్కువమంది వుంటారు. అందులో చిరపరిచితులైనవాళ్ళు చనిపోతే మనకి ఏడుపురాదు, మాటలురావు. మనస్సు స్తబ్ధతని పొందుతుంది. కొన్ని క్షణాలు ఊపిరి నిలిచినట్టవు తుంది.

'ఇంత చెబుతున్నావు; హేమలత ఎవరూ నువ్వెవ్వరు. ఆవిడి చావుతో నీకు సంబంధం ఏమిటి? అది ఆత్మహత్యఎందు కని అనుకుంటున్నావు' అని నీకు సందేహం కలగొచ్చు.

దానికే వొస్తున్నాను. అసలుకథ ఇది!

మాది ఒక టేవూరు.

హేమలతా నేనూ కలిసి చదువుకున్నాము. తరువాత కారణాంతరాలవల్ల హేమలత చదువు మానింది.

మా చిన్నతనంనుంచీ మేము ఎంతో స్నేహంగా వుండే వాళ్లం; మేము భార్యాభర్తలంకామని మమ్మల్ని ఎరిగిన వాళ్లెవ్వరూ నమ్మలేదు. చాలామంది మిత్రులు అడ్వాన్సు అభినందనలుకూడా తెలీచేస్తో వుండేవారు. మీ పరిచిత పారి భాషికపదాల్లో చెప్పాలంటే మేము పరస్పరం "ప్రేమించు కున్నామన్న మాట. మమ్మల్ని 'ప్రేమ' అనేది బంధించింది."

మామూలుగా మీరు చదివే కల్లోలానే మా ప్రేమ బంధనలు తెంచబడ్డాయి. మరోవ్యక్తి మా మధ్యకి బలవం తంగా తీసుకొని రాబడ్డాడు. హేమలత ఒక లైలాలా తన తండ్రి నిబంధనలకి కట్టుబడిపోయింది. నేను దూరంగా చదు వులో ఉండిపోయాను. అక్కడికి ఓసారి ఉత్తరం రాసింది. "అర్జంటుగా రమ్మ"ని కాని మేం కలుసుకునేందుకు వీలు లేక పోయింది.

ఎవరో ధనికుని కొడుకు కట్నం, కానుకలు లేకుండానే హేమలతను పెళ్ళిచేసుకునేందుకు తయారయ్యాడు. హేమ లత సౌందర్యం, సంగీతం ఆతడ్ని ముగ్ధుడ్ని చేశాయి. ఇంక ఆమె తల్లిదండ్రుల్ని పట్టశక్యం కాలేదుట. అంత గొప్ప సం బంధం ఇంత చవకగా కుదురుతుంటే ఏ తెలుగుతండ్రి ఆనం దించడు?

పెళ్ళిలో ఆఖరిసారి చూశాను. హేమలత గుండె పగి లేలా ఏడుస్తుం దనుకున్నాను. కాని అదేమీ జరగలా!

ఒకసారి వీలు చూచుకుని ఇంటి వెనకాల మామిడి చెట్టుక్రింద కలుసుకున్నాను.

అదేపనిగా నా దురదృష్టాన్ని గురించి ఏకరువుపెట్టి విల పించ సాగాను.

కాని హేమలత ఏమీ అనలేదు, నాకు ఆశ్చర్యం వేసింది. ఏం? నన్ను ప్రేమించడంలేదా? ఇన్నాళ్ళ మాస్నేహం అర్థం లేనిదేనా? ఒక్క-క్షణంలో వాడుకలో హేమలత జీవితం అన్నాళ్ళూ చూసినదానికి వ్యతిరేకంగా కనిపించింది.

చివరికి చెప్పింది.

“నేనేం మాట్లాడాలో నాకే తెలీటంలేదు. నేను మాన సికంగా ఆత్మార్పణ నీకు ఎప్పుడో చేశాను. అది నీకు తెలి యందికాదు. ఈ దుస్సంఘటనకి కారణం చేతకానితనంఅంటే నేనూరుకోను.

“మన సమాజం అంతే. మన జీవితము ఇంతే! ఏం జరి గిందో తెలుసా? మూడురోజులు అదేపనిగా మా నాన్న తోనూ, అమ్మతోనూ పోరాను. కాని నిరాశా, నిస్పృహ మిగిలాయి, ఫలితంగా.

“అందుకని ఇలా నిర్జీవిగా మిగిలాను. నిన్న నా భర్త పెళ్ళి చేసుకున్నది నీ హేమలతకాదు. ఆమె ఈ పెళ్ళి నిశ్చయ మైనప్పుడే మృతి చెందింది. ఇది ఒక బొమ్మమాత్రమే.

“నీ హేమలత నీకోసం స్వర్గంలో ఎదురుచూస్తుంది.”

గుడ్లలో నీళ్లు నిండాయి. పెద్ద వేదాంతిలా, వక్తలా చెప్పింది. అప్పుడు నాకు హేమలత నిజస్వరూపం కనబడింది. ఇక మాట్లాడలేక సెలవు తీసుకున్నాను.

తర్వాత హేమలతని గురించి చాలా కబుర్లు విన్నాను. ఇద్దరు పిల్లలుకూడా పుట్టారుట.

కాని ఒకసారెప్పుడో చూశాను. మళ్ళీ చిక్కిపోయి శల్యమైపోయింది. "ఈమె నా హేమలతేనా?" హృదయం రోదించింది."కాదు, నా హేమలత స్వర్గంలో ఎదురుచూస్తుంది. ఈవిడ వేరు" మనసు శాంతపడింది.

అలా భౌతికంగా జీర్ణించి, తల్లితండ్రుల భర్తయొక్క సంతోషానికి బలియై, తన ధర్మాన్ని నెరవేర్చుకుని - 'నెమ్మది చావు'ని ఆహ్వానించి ఆత్మహత్య చేసుకుంది.

హేమలతది సరైన మరణంకాదు. "ఆత్మహత్య" అని నా మనస్సు ఘోషిస్తోంది. కాని అందరూ అకాలమృత్యువు అని అనుకుంటాారు.

---